
**ఊరికి దూరంగా ఉంటున్న మంగమ్మ ఇల్లు ఒంటి నిట్టాడి పూరిల్లు. గుడిసె కంటే పెద్దదీ, ఓ పూరింటి కంటే చిన్నదీ - అప్పటికే కప్పు కంతలు పడి - ఎండా, వానా ఇంటిలోకి ఇంకి పోవటం మొదలయింది.**

# పిచ్చుకలు

బొలిమంత నాగేశ్వరరావు

కుక్కి నులక మంచంమీద మంగమ్మ పడుకొని వుంది. ఒంటిమీద అతుకులు పడ్డ చిరిగిపోయిన చీర వుంది. కూతురు పనిచేస్తున్న ఇంటి యజమానురాలు విమలమ్మగారు దానం చేసిన జాకెట్టు ఉంది. అదీ వదులుగా ఉంది. దాని చేతుల్లోంచి మంగమ్మ చేతులు పుల్లల్లా కనపడుతున్నా మంగమ్మ అది దొరకడమే తన అదృష్టంగా భావించింది.






మంగమ్మ ఆ ఇంటిలోంచి విమలమ్మగారి జాకెట్టులే కాకుండా - పాతవై చిరిగిపోయిన చీరెలు కూడా తెచ్చుకుంటుంది!

మంగమ్మ వయసు ముప్పయికి చేరితే - మనిషి ఏభైకి చేరినట్టు అదోలా వుంటుంది. నెత్తిమీది జుట్టు సగం అప్పటికే తెల్లబడింది. ముఖంలో ముడుతలు వచ్చాయి.

మంగమ్మ భర్త రాజయ్య ఓ పాత సైకిల్‌మీద ఐస్‌లు ఊరూరా తిరిగి అమ్ముకుంటాడు. అతని బేరం ఎక్కువగా ఎలిమెంటరీ స్కూల్స్, హైస్కూల్స్ బయట జరుగుతుంది. ఆ పిల్లలు బయట కొచ్చినప్పుడు రాజయ్య సైకిల్ దగ్గర కొచ్చి తలా ఒక ఐస్ కాండీ కొనుక్కుని వెళ్తారు. ఒకటీ అరా మిగిలితే అవి ఊరు మీద తిరిగి అమ్ముకుని రాజయ్య ఇంటికి చేరతాడు.

రాజయ్య ప్రభుత్వ సారా అమ్మే రోజుల్లో వచ్చిన లాభంలో మూడొంతులు తాగి, మిగతా దానితో ఉప్పు చేప ముక్కల్ని కొనుక్కుని చింతపండూ, మిరపకాయలూ, కూడా తెచ్చుకొని, భార్యచేత పులుసు పెట్టించుకొని బియ్యంతో తనకు పనిలేదన్నట్టు మంగమ్మ పెట్టింది తిని మంచం మీద ఒరిగిపోయేవాడు.

భర్త తీరు మంగమ్మకు ఆవేదన కలిగించేది. ప్రజల ఆందోళన పుణ్యామా అని... ప్రభుత్వం వారు తమ పాపాన్ని ఈ మధ్య ఎత్తేశారు! అప్పటి నుండి రాజయ్య సంపాదనలో కొద్దోగొప్పో - ఎండు చేపలూ, చింతపండుతో పాటు ఇంటికి చేరుతున్నాయి.

మంగమ్మ కూతురు కోటికి ఏడేళ్లు...!

విమలమ్మగారి ఇంటిలో పనిమనిషిగా ఎప్పుడో పెట్టింది!

మొదట్లో కోటికి కోటేరు లాంటి ముక్కూ, చేపల్లాంటి చక్కటి కళ్లు, నవ్వితే బుగ్గల మీద

సొట్టలూ, తెల్లటి పలువరుసా, నల్లటి వొత్తైన జుట్టూ, ఉండేవి! ముందు ముందు నాజూకైన 'అమ్మడు' అవుతుందని చూసిన ప్రతి మనిషీ అనుకునేవారు.

పనిలో చేరిన దగ్గర నుండీ కోటి రూపం మారిపోతూ వుంది!

కోటేరులాంటి ముక్కులో కొట్టవచ్చినట్టు కనిపిస్తోన్న అందం పోయింది ! చేప కళ్లు లోతుకు పోయి గుంట కళ్లలా మారిపోయాయి.

సొట్టలు పడటానికి బుగ్గలు లేవు. అసలా బుగ్గలే పెద్ద సొట్టలుగా మారి గుండ్రటి ముఖం బారుగా తయారయ్యింది. తెల్లటి పలువరుస గారపట్టి పసుపు పచ్చగా కనిపిస్తుంది.

జుట్టుకునూనెలాంటిది రాయటం లేక - పీచుతేలటం మొదలయింది.

సదరు ఏడేళ్ల కోటి విమలమ్మగారింటిలో ముప్ఫయ్ రోజులు పనిచేస్తే అర్వై రూపాయ లిస్తారు!

తాము తిన్నాక మిగిలింది తినమంటారు.

తాము పడుకున్నాక వరండాలో మూలన చాపేసుకుని పడుకోమంటారు.

ఆరోజు కోటితల్లి మంగమ్మ కూతురు జీతం తీసుకోవటానికి తన గుడిసె నుండి విమలమ్మగారి పాలరాతి భవంతికి చేరింది. అప్పటికే ఉదయం ఎనిమిది గంటలయింది!

అప్పుడే ఆ ఇంటిలో ఒక్కొక్కరూ లేచి హడావుడి పడుతున్నారు. ప్రతి రాత్రి వారు స్టార్ టీవీల్నీ, కేబుల్ సినిమాల్నీ చూసి పదకొండు దాటితే తప్ప నిద్రపోరు...!

తెలుగు సినిమాలు చాలా సందేశాత్మకంగా ఉంటాయి!

ప్రేమించి పెళ్లి చేసుకోమని కుర్రకారుకి తెర మీద చెప్పి నిజజీవితంలో తమ ఇంటి పిల్లలు ప్రేమిస్తే జుట్టు పట్టుకొని బజారుకీడ్చే హీరోలూ, బ్లాక్‌మనీ బయటకి తీసి ఈ దేశానికి 'సంక్షేమం' చేకూర్చండని చెప్పి - తామే బ్లాక్ మనీని లంబర్ రూమ్స్‌లో కుక్కి ఆనందించే అద్వితీయ నట నాయకులూ, సెల్యులాయిడ్ మీద విలన్లని తన్ని తమ సెల్ఫ్ విషయంలో నిజమైన విలన్స్‌గా ప్రవర్తించే నట శిఖామణులూ, ఆవేశంగా, ఆగ్రహంగా నటించిన సినిమాల్ని తిలకిస్తూ, పులకిస్తూ అర్ధరాత్రి వరకూ కాలం గడిపి పొద్దెక్కాక నిద్రలేచే విమలమ్మ గారి కుటుంబం సంగతి మంగమ్మకు అంతగా తెలియదు!

వచ్చి వరండాలో ఒక స్తంభాన్ని ఆనుకొని కూర్చుంది.

ఆ వరండా కున్న అలాంటి స్తంభాలు నోరు తెరుచుకొని ఆవలిస్తున్న పులి పళ్లలా తెల్లగా బజారులో ఉండి చూస్తే స్పష్టంగా కనిపిస్తాయి. వరండా కింద నేలకు పరిచిన ఎర్రటి గచ్చు ఆ పులి నోటి నాలుకలా అనిపిస్తుంది. ఇంకా ఆర కుండా వెలుగుతున్న భవంతి మీది హెడ్‌లైట్లు ఆ పులికున్న మెరిసే కళ్లలా జిగేల్ మంటున్నాయి. సదరు పులిలాంటి భవంతి తన నోటిని తెరిచి బజారు వైపు తిరిగి, తన భారీ శరీరాన్ని అరలుగా, అంతస్తులుగా అటువైపుకి ముడిచి బారుగా పడుకున్నట్టు కాస్త ఆలోచన చేయగల ఎవరికైనా అనిపిస్తుంది.

సదరు నోరు తెరుచుకొని పడుకున్న కొండంత పులిలాంటి భవంతిలో లోపల విమలమ్మగారి భర్త అరుస్తున్నాడు.

"ఏమే కోటీ - ఇంకా నా బూట్లు తుడవలేదా? ఎక్కడ చచ్చావే ఇప్పటిదాకా?"

చెప్పింది గుర్తు ఉంది. ఎందుకో తనూ ఆ రోజు ఆలస్యంగా లేచింది. శరీరమంతా నొప్పులుగా ఉన్నయ్. జ్వరం తగిలేట్టు ఉంది. అసలు పడుకున్నాక లేవాలనిపించలేదు.


కానీ లేవక తప్పలేదు.

ఇప్పుడు పెద్దయ్యగారి బూట్లు తుడవాలి.

చిన్నమ్మగారికి బాత్‌రూంలో వేడినీళ్లు పెట్టాలి.

చిన్నయ్యగారికి అర్జెంట్‌గా బజారెళ్లి షాంపూ బాటిల్ తేవాలి.

అమ్మగారు చెప్పినట్లు ఇంటి ముందరి ఆకులన్నీ ఊడ్చి శుభ్రం చేయాలి... తర్వాత ఇల్లంతా తుడవటం... వంట చేసే మనిషి వచ్చి అంట్లు తోమేటప్పుడు సాయం చేయడం.. తీరిక లేనిపని - శరీరం అలిసి పోతుంది. పన్నెండు గంటలకు ఏదో అయినట్టు, పోయినట్టూ స్నానం. అదీ తనకంటూ ఓ ఎర్రసబ్బు ఇస్తారు. అది




అవతల గదిలోంచి విమలమ్మగారమ్మాయి 'శ్రావణి' ఆగ్రహంగా అంది.

"ఏమే కోటీ... ఎన్నిసార్లు చెప్పాలే నీకు. బాత్‌రూంలో హాట్ వాటర్ పెట్టమని...! నిన్ను రోజుకోసారి తన్నితేగాని గుర్తుకు రాదనుకుంటా...'

అటుగా వెళ్తూ విమలమ్మగారబ్బాయి అంటున్నాడు...

"ఏమే కోటీ. నేను స్నానం చేసి బయటికెళ్లాలి. షాంపు బాటిల్ పట్రా... క్విక్..." అంటూ కోటి ముందు ఓ ఏభై రూపాయల కాగితం విసిరినట్టు చేతిలో పెట్టాడు.

విమలమ్మ మరో దారి నుండి బయటి వస్తూ "ఇంటి ముందు ఐదింటికే లేచి ఆకులన్నీ ఊడవ మన్నాను. ఊడ్చావంటే...?" పెద్దగా అడుగుతోంది.

అన్నింటికీ కోటి వణికిపోతూ, బిక్కముఖం పెట్టి అలాగే నిలబడింది. విమలమ్మ గారు

అమ్మగారు అయ్యగారు వాడుకునే సబ్బుల్లా కమ్మటి వాసన ఉండదు.

అయినా కోటి వాసనలు ఎప్పుడూ కోరు కోలేదు!

పనితగ్గి తానూ కాస్సేపు టీవీలో అమ్మగార్లు చూసే సినిమాలు చూడాలని కోరుకునేది!

ఇంటిముందు విశాలమైన ప్రదేశం ఉంది.

రకరకాల పూల చెట్లు. చిన్నమ్మగారు ఓ తవుగోలిచ్చి నేలంతా తవ్వమంటుంది. గడ్డిగాదం తీసేయమంటుంది. చెట్లకు నీరు పోయమంటుంది.

మరలా వారు తిన్న పాత్రలన్నింటినీ తనే తోమాలి.

రాత్రికి మరలా వంట మనిషివచ్చి మరోసారి అవన్నీ తను శుభ్రం చేస్తూ తనమూ చేయ

మంటుంది...

కోటి ముందు పెద్దయ్యగారి పనికీ, చిన్నయ్యగారి పనికీ అటెండ్ అవుదామని వరండాలోకి వచ్చింది. వరండాలో ఉన్న తల్లిని చూసి కాస్త ఆశ్చర్యపోయింది. ఆ తరువాత బిక్క ముఖం పెట్టింది. ఒక్కసారిగా ఏడ్వాలనిపించింది. ఏడిస్తే ఎందుకేడ్చావని ఆ తరువాత పెద్దమ్మ కొడుతుందని గుర్తు చేసుకుంది. కళ్లల్లో తిరిగిన నీటిని గభాల్న ఒంటి మీదున్న పరికిణీతో తుడుచుకుంది.

ఆ సమయంలో మంగమ్మ కుమార్తె వంక పరిశీలనగా చూసింది.

గాలివానలో లేత ఆకులా ఉంది.

కప్ప నోటి లోని పాములా వణికిపోతోంది.

పులి గుహలో పడ్డ లేడిపిల్లలా వుంది.

నీటి మడుగు నుండి ఇసుకనేలపై విసిరి వేయబడ్డ చేపపిల్లలా ఉంది.


శరీరం మీద చెమటలున్నాయి. ముఖం ఎర్రగా కందగడ్డలా వుంది.

మంగమ్మకు కడుపు తరుక్కుపోయింది. వెంటనే కూతురు చేతిలోని ఏభై రూపాయలు తీసుకొని -

"గాభరా పడకే అమ్మా! అయ్యగోరికి సాంపూ సీసా నేతెత్తా- ఇంటి ముందు ఆకులు నేనూడుత్తా. ఈలోగా పెద్దయ్యగోరి బూట్లు తుడువ్. సిన్నమ్మగోరికి ఏడినీళ్లెట్టు" అంటూ గబగబ బయటికి పోయింది.

తల్లి తను చేయాల్సిన పనుల్లో భాగం పంచుకొంటుంటే, కోటికి కాస్త రిలీఫ్ అనిపించింది. ఇంతలో వంట మనిషి వచ్చింది.

ఉదయం అందరికీ ఆమె కాఫీ కలిపి ఇస్తుంది.




తనకీ రెండు గుక్కలు వేడి వేడి కాఫీ ఇస్తే తాగాలనిపిస్తోంది.

తల్లి అటుపోగానే పెద్దయ్యగారి బూట్లు తుడిచింది.

గబగబ బాత్‌రూంలోకెళ్లి స్టీల్ బక్కెట్ నిండా నీరుపెట్టి హీటర్ అందులో వేసి స్విచ్ బోర్డులో దాని ప్లగ్ అమర్చింది!

ఈ మధ్య బాత్‌రూంలోని 'గీజర్' పనిచేయకుండా పోయింది. మెకానిక్‌కు కబురు చేస్తే ఇంతవరకు రాలేదు. అప్పటినుండి ఉదయం చిన్నమ్మగారికి, రాత్రిళ్లు అందరికీ తానే వేడినీరు బక్కెట్లల్లోకి సర్దుతుంది. వారంతా స్నానం చేశాక తను చల్లని నీరే పోసుకుంటుంది.

కోటి తల్లి వచ్చిందని తెలిసి విమలమ్మ బయటికొచ్చి అలాగే కుర్చీలో కూర్చుంది! కూతురు చేయలేని పనులు ఏవన్నా మనసుకు స్ఫురిస్తే తల్లితో చేయించాలని ఆమె మనసు చురుకుగా పనిచేయటం మొదలెట్టింది.

ప్రతినెలా జీతం ఇచ్చేముందు మంగమ్మతో ఓ పని చేయించుకుని ఆ రోజు తయారు చేసిన బ్రేక్‌ఫాస్ట్‌లో తాము తినగా మిగిలింది పెడుతుంది! ఆనందంగా మంగమ్మ తింటుంది! తిన్న టిఫిన్ కాక చేతిలోని అరవై రూపాయలు మంగమ్మకు మహదానందంగా కనిపిస్తాయి. -

అరవై రూపాయల్తో నేరుగా రేషన్ షాపుకెళ్లి డీలర్ సాంబయ్యకు అడ్వాన్సుగా ఏభై రూపాయలు చేతిలో పెడుతుంది. ఆయన కోటా బియ్యం రాగానే పాతిక కిలోలు ఇస్తాడు. ఇక మిగిలిన పది తీసుకొని ఇంటికి పోతుంది.

ఆ తరువాత కథ మామూలే ...

కూతురు పనిచేస్తుండబట్టే ఒకేసారి చేతిలో అరవై రూపాయలు కనిపిస్తున్నాయి. లేకుంటే కోటా బియ్యం రాగానే ఏభై రూపాయలు ఎక్కడ దొరుకుతయ్...!

మంగమ్మ అనేక సార్లు ఈ విషయం తలుచుకుని మురిసి పోతుంది...!

కానీ ఆరోజు మంగమ్మ మనసెందుకో గుబులయింది.

తన కూతురికి అంతా ఒకేసారి అన్ని పనులు చెప్తారు కాబోలనుకుంది. బయటికొస్తూ బిడ్డ వణికిపోయిందని ఒకింత ఆవేదన పడింది. అలా పడుతూనే షాంపూ సీసా తీసుకొని వచ్చింది.

వరండా కుర్చీలో నిండుకుండలా కూర్చున్న విమలమ్మతో "దండాలమ్మా" అంది. విమలమ్మ ప్రతిగా దండం తన లెవెల్‌కు తక్కువ జనానికి పెట్టదు గనుక చిన్నగా నవ్వి - "మంగీ" అంటూ మృదువుగా పిలిచింది.

"చెప్పండమ్మగోరూ"

"మరేం లేదే - పండగొస్తుంది కదా...! గోడలకున్న బూజు దులపటం కప్పును శుభ్రం చేయటం నీ కూతురు వల్ల అవుతుందో లేదో... నువ్వు దానికి సాయంగా వుండరాదూ!"

"సాయమేముందిలే అమ్మగోరూ! రేపు మద్దేణం నేనే వచ్చి సేత్తా" అంది. విమలమ్మ ముఖం వెలుతురుకు విచ్చుకున్న కమలంలాగా అయింది!

ఆ తరువాత విమలమ్మ ఇంటిలోనికి పోయింది!

మంగమ్మ భవంతి ముందు రాలిన చెట్ల ఆకుల్ని మొత్తం ఊడ్చి తట్టలో పోసుకుని తీసుకుపోయి బజారులోని డస్ట్‌బిన్‌లో పోసింది!

మరలా వచ్చి వరండాలో స్తంభానికి ఆనుకుని కూర్చుంది.

వంటింటిలోంచి చిన్న ఆకులో కాస్తంత ఉప్మాతో పాటు అరవై రూపాయలు తెచ్చి విమలమ్మ మంగమ్మ చేతిలో పెట్టింది.

మంగమ్మ అవి తీసుకొని అక్కడే నిలబడిన కూతురి వంక ఆనందంగా చూసింది. కూతురు కోటి ముఖంలో ఎలాంటి ఆనందం కనిపించక పోయేసరికి మంగమ్మ మనసు మరి కాస్త పీకింది.

★ ★ ★

మంగమ్మ తన ఒంటినిట్టాడి పూరింట్లో కుక్కి మంచం మీద పడుకుంది. వేసవిలో మంగమ్మకు పని దొరకదు. అక్కడక్కడ పట్నం బయటి పొలాల్లో పచ్చగడ్డి కోసి తట్టలో ఎత్తుకుని మార్కెట్ దగ్గర అమ్ముకుంటుంది. వచ్చిన పదీ పరకతో ఇంటిలోకి కావాల్సిన కూరగాయలు, మజ్జిగనీళ్లు, నూనెలూ, ఇతర దినుసులూ కొని తెస్తుంది.

వర్షాలు పడి చేలన్నీ పచ్చగా కనిపిస్తే తప్ప మంగమ్మకు పని దొరకదు.

మంగమ్మకి ఈ పనులు మానేసి తనూ ఏ కలవారింట్లోనో నెలవారీ పనికి కుదిరితే బాగుండునని పిస్తోంది.

ఆమె అలా అనుకుంటూ అప్రయత్నంగా కప్పులో ఉన్న పిచ్చుక గూడు వైపు చూసింది. తమ పేదింట్లోనే అవి గూడుకట్టుకున్నాయి. ఆ గూటిలో గుడ్లు పెట్టాయి. పిల్లల్ని పొదిగాయి. ఇప్పుడు బయటి నుండి ఆడా మగా పిచ్చుకలు ఆహారాన్ని తెచ్చి తమ పిల్లల నోటికి అందిస్తున్నాయి.

పిల్ల పిచ్చుకలు తమ ఎర్రటి నోళ్లను తెరిచి తల్లి అందించే ఆహారాన్ని కిచకిచ మంటూ ఆనందంగా తింటున్నాయి. ఇంకా ఈకలు మొలవని లేత రెక్కల్ని ఆ సమయంలో సంతోషంగా ఆడిస్తున్నాయి.

పెద్ద పిచ్చుకలు మాత్రం అదేపనిగా బయటికెళ్లి గింజల్ని, చిన్న చిన్న పురుగుల్ని ముక్కు నిండా అమర్చుకుని మరలా వస్తున్నాయి. వాటిని చూసి పిల్ల పిచ్చుకలు మరలా తమ ఆకలి నోళ్లను తెరిచి ఆబగా తింటున్నాయి.

ఆ దృశ్యాన్ని చూసేక మంగమ్మకి ఎవరో వెన్ను పూస మీద చరిచినట్టు శరీరం జలదరించి పోయింది.

అప్రయత్నంగా కన్నీరు కనుకొలకుల్లోంచి కిందికి జారింది.

సరిగ్గా అదే సమయానికి రాజయ్య ఇంటిలోకి వచ్చాడు., వస్తూనే అన్నాడు.

"దీనెవ్వ మళ్లాసమ్మెంట. ఇస్కూలు. కాలేజీల కుర్రోల్లు ఈదులెంటబడి కొట్టులన్నీ మూయిత్తుండారు. 'అయిస్' కొట్టు కూడా మూతేసింర్రు! ఆడెవరో సూడెంట్ కుర్రోన్ని చంపింర్రంట...!" అంటూ చలికిల బడ్డాడు.

తన మాటలకు మంగి ఏమాత్రం చలించ కుండా అలాగే పడుకుని వుంటే-

"ఏందే అట్టుండావ్?" అంటూ అడిగాడు.

మంగమ్మ లేచి ఒక్కసారిగా వెక్కివెక్కి ఏడవడం మొదలు పెట్టింది.

"ఏమయిందెహె... సెప్పి ఏడువ్"

"ఏంసెప్ప మంటావయ్యా! ఈ రోజు బిడ్డ జీతం రాళ్లు తేవడానికి ఇమలమ్మ గోరింటికి ఎల్లినా... అక్కడ ఆ పసిగుడ్డుకు అందరూ ఒకేసారి ఊపిరి సలపని పని సెప్పితిరి. భయంతో బిడ్డ అయ్యన్నీ సెయ్యలేక గాలివానలో సెట్టు లేతాకులా వణికి పోయిందయ్యా! నాకు అక్కడే ఏడు పొచ్చింది... ఏవయ్యోయ్! ఒక్కసారటు సూడు - మనపేద కొంపలో గూడుకట్టుకున్న పిచ్చుకల జంట... ఎన్నేసార్లు సూసినా... అయి ఆటి పిల్లల్ని రెక్కలొచ్చేదాకా సాకుతయ్. ఎగిరే దాకా దగ్గరుండి తిండి పెడుతుంటాయ్. మరి మనమేమి సేసినామయ్యా! ముక్కుపచ్చలారని గుంటని తీసుకుపోయి పెద్దోల్ల లంకంత కొంపలో చాకిరి సెయ్యమని పంపితిమి! పన్లు సెయ్యడానికి దాని రెక్కలు బిగవలేదయ్యా. లేత మండకి ఎన్ని వనులు సెవుతుండరో నువ్ కళ్లారా సూడలేదయ్యా...

"ఏవయ్యా! మనం... ఆ పిచ్చుకులపాటి సెయ్యలేమా? ఆటి మాత్తరం ఆలోచన మనకు లేదయ్యా?! పగలంతా తిండి పెట్టి రేత్తిరవ్వగానే రెక్కలకింద పిల్లల్ని పెట్టుకుని ఎచ్చగా నిద్రోతాయయ్యా!

"మన బుజ్జి ముండకి కడుపునిండా తిండి పెట్టి మన డొక్కల్లో ఎట్టుకుని నిద్రోయిందె ప్పుడయ్యా! సెప్పు నువ్...!

రాజయ్య కూడా మంచం మీద వెల్లకిలా పడుకుని భార్య చెప్పిందంతా విని పైన ఇంటి కప్పులో తమ పిల్లల్ని పెట్టుకుని ఆహారం అందించే పిచ్చుకల్ని కాస్సేపు కన్నార్పకుండా చూశాడు.

భార్య మంగి అన్నమాటల్లో ఏదో 'నిజ్జం' ఉన్నట్టు అతనికి తోచింది.

రెక్కలొచ్చే వరకూ తమ పిల్లల్ని పక్షులు సాకుతున్నాయి.


మనుష్యులు మాత్రం తమ పిల్లల రెక్కల కష్టాన్ని తింటున్నారు.

"పిచ్చుకల పాటి సెయ్యమయ్యా...!" మంగి మాటలు మరోసారి మనసులో మోగినాయ్!

అతని మనసును ఏదో కెలికినట్టు ఆవేదన... వెంటనే

"మంగీ!" అన్నాడు.

"ఏందయ్యా!" మంగి కన్నీళ్లు తుడుచుకుంటూ అంది.




"ఏవయ్యా! పిచ్చుకలే కాదయ్యా - మనసులోకి తెచ్చుకో - మనసుట్టూ ఎగిరే పచ్చులన్నీ తవతవ పిల్లల్ని రెక్కలొచ్చే దాకా పెంచుతాయయ్యా! మనింటి ముందరి కోడి కూడా పిల్లలు తనంతయ్యే దాకా తను తినకుండా కనబడ్డ గింజనల్లా, ఏరి పిల్లలముందు పడేత్తదయ్యా!

"మరీడ మనలాంటి మడుసులేందయ్యా - పిల్లగోల్ల రెక్కలు మీద బతకాలని సూత్తారు! ఎందుకయ్యా అంతకాడి కాళ్లని కంటం...

"అందుకే అమ్మగోరిచ్చిన అరవై రూపాయలూ కర్సు సెయ్యకుండా తెచ్చినా. ఎందుకో అయి కర్సు సేసి బియ్యాం తెచ్చుకు తింటే కడుపులో దేవినట్టుంటదనా ఈనెల రేసన్ కొట్టు సాంబయ్యకి ఇయ్యకుండానే తెచ్చానయ్యా!" అని మరలా వెక్కిళ్లు పడుతూ ఏడవసాగింది!

"ఆ డబ్బు యిటివ్వే..."

"ఏం సేత్తావ్?"

"ఏదో సేత్తా. నువ్వే సూత్తావుగా!"

మంగి భర్త చేతికి అరవై రూపాయలు ఇచ్చింది...

★ ★ ★

రెండ్రోజుల తర్వాత -

కోటి కొత్త లంగా జాకెట్టు వేసుకుని పలకా బలపం పట్టుకుని ఎలిమెంటరీ స్కూల్లో "అ ఆ ఇ ఈ" అంటూ అక్షరాలు దిద్దుతోంది.

అక్కడ మంగి మరోసారి పిచ్చుకల్ని చూసింది.

అవి పిల్లలకు ఆహారం అందించే దృశ్యం.... అపురూపంగా, ఆనందంగా, ఆత్మీయంగా ఆదర్శంగా, ఆరాధ్యంగా కనిపించింది!